కథానిక

# డబ్బు యిచ్చే సంస్కారం

## యన్. ఆర్. నంది

రాత్రి పదవుతుంది. శ్యామల క్లబ్ నించి ఇంకా తిరిగి రాలేదు. ఆమెకోసం చూసి చూసి విసుగెత్తి రామచంద్రరావు గారు డైనింగ్ టేబిల్ ముందు కూచొన్నారు. కూతురు పక్కన లేంది ఆయనెప్పుడూ ఒంటరిగా భోంచేయ లేరు. ఆయన భోంచేసేటప్పుడు శ్యామల తప్ప మరొకరెవరూ ఆ గదిలో వుండరు.

అంతలో కిటికీ దగ్గర ఏదో శబ్దం వినిపించి, ఆయన తలెత్తి అటు చూశారు. ఒక ఆకారం కిటికీలోంచి ఛంగున దూకింది. మొలనించి ఉక్కుకత్తిని భర్రున తీసి దగ్గరగా వచ్చింది. రామచంద్రరావుగారు ఏమీ మాటాడలేక పోయారు. అలానే తేరపారి చూస్తున్నారు.

"ఎవరు నువ్వు?" అని కాసేపయిన తర్వాత ప్రశ్నించారు.

"నీలాంటి మనిషినే. భయపడనవసరంలేదు" అంటూ ఓ కుర్చీ లాగుకొని కూర్చొంది. ఆ గొంతుకని బట్టి మగాడే అని పోల్చారు. "నాకు ఆకలేస్తోంది, అన్నం కావాలి" అన్నాడు టేబిల్ మీద కత్తితో పొడుస్తూ.

"నీకు ఆకలేస్తే హోటళ్లున్నాయిగా?"

"అక్కడ డబ్బు కావాలి. అది నాదగ్గర లేదు. ఆ డబ్బంతా నీలాంటివాళ్ళ యినప్పెట్లెల్లో మూలుగుతోంది. సరే నాకు అన్నం పెట్టదలచుకొన్నావా లేదా ?" అంటూ అరచాడు.

ఏమిటి వీడి దౌర్జన్యం! తనంత శ్రీమంతుణ్ణి 'నువ్వు' అని ఎంత ధైర్యంగా పిలుస్తున్నాడు. ప్రాణంగల వాడికంటె వాడి చేతిలోని ప్రాణం లేని కత్తిని చూసి ఆయన భయపడుతున్నారు.

"ఊఁ, పెట్టు" అంటూ ఆయన ముందున్న ప్లేటుని లాక్కొని, ఎడంచేత్తో కత్తిని పట్టుకొని దొరికిందే తడవుగా కుడిచేత్తో ఆ ఎంగిలి ముద్దని బుక్కేస్తున్నాడు.

"ఏం? అలా తేరపారి చూస్తున్నావ్ ? మరో ప్లేటు భోజనం తెప్పించుకో. పాపం! నీకు మాత్రం ఆకలి కాదూ."

రామచంద్రరావు గారు నౌకర్ని పిలవ బోయారు.

"ఏయ్! ఆ నౌకర్ని పిలచి నాగురించి ఏమయినా చెప్పావా, మరి నీ ప్రాణం దక్కదు" అన్నాడు కత్తిని చేతితో ఆడిస్తూ.

నౌకరు రాగానే, ఆయన మరో ప్లేటుతో భోజనం తెప్పించుకొన్నారు. కాని ఎదురుగుండా ఎవడో ఒక దరిద్రుడు అంత నీచంగా, దౌర్జన్యంగా మాటాడుతోంటే, ఆయన శ్రీమంత రక్తం సహించలేకపోయింది. కాని మాటాడితే ప్రాణహాని కలుగుతుందని ఏమీ మాటాడకండా వున్నారు.

అంతలో తలుపు ఎవరో తట్టారు. రామచంద్రరావు గారు లేవబోయారు. వాడు వారించాడు.

"మా అమ్మాయి, శ్యామల" అన్నారు మెల్లగా.

"అవునియ్. నేవెళ్లి తలుపు తీస్తాను. ఆ వ్యక్తి నీ శ్యామల కాకపోతే కత్తికి బలిచ్చేస్తాను" అనుకొంటూ వెళ్లి, వాడు ఎంగిలి చేత్తోనే తలుపు తీశాడు.

నిజంగా ఎవరో స్త్రీ ప్రత్యక్షమయింది. ఆమె ఈ అపరిచితుణ్ణి చూసి వెనక్కి తగ్గింది గాని, వాడు లోపలికిరమ్మని ఆహ్వానించడంతో మాటాడకండా వచ్చి, డైనింగ్ టేబిల్ముందు కూచొంది. వాడు వచ్చి కూచొన్నాడు. కాసేపటి వరకూ శ్యామలకేసి ఆమె తండ్రికేసి చూసి, ఇక ఆయన తన్ని ఆమెకి పరిచయం చేయడనుకొని వాడే మొదలుపెట్టేడు:

"చూడండి. నేను మీ యింటికి బలవంతపు అతిథిని. కత్తితో భయపెట్టి ఈ అన్నం తింటు

న్నాను. నాకు చిన్నతనంలోనే మా అమ్మా, నాన్నా చనిపోవడంచేత నాకు వాళ్ళేం పేరు పెట్టారో జ్ఞాపకంలేదు. ఇరవైయేళ్లు వచ్చిన తర్వాత, మానవజాతిలో ప్రతివారికీ ఒక్కొక్క పేరుండాలని కనిపెట్టి, నా పేరు నేను పెట్టుకొన్నాను. కాని ఆ పేరు పెట్టి నన్నెవరూ పిలిచే వారు కారు. కారణం: నాకెవరూ స్నేహితులు గాని, సన్నిహితులు గాని, బంధువులు గాని లేరు. అందువల్ల నేను పేరులేని మానవత్వం గల మనిషిని'' అన్నాడు.

శ్యామల వాడికేసి వింతగా, ఆశ్చర్యంగా చూస్తోంది. రామచంద్రరావుగారు పళ్ళు పటపట కొరుకుతున్నారుగాని, ఈ సమయంలో తన యినప్పెట్టెలో వున్న కరెన్సీ నోట్లు, వెండి బంగారు నాణాలు వాణ్ణి దండించడానికి వుపయోగపట్టం లేదు.

“శ్యామలగారూ,'' అని పిలిచి వాడు మళ్ళా మొదలుపెట్టాడు. “నేను దరిద్రుడనైనా, ఒంటరిగాడినయినా, దిక్కుమాలినవాడినయినా మానవుణ్ణి గాబట్టి మీలాగే నాకూ జీవించాలని బుద్ధిపుట్టింది. సృష్టిలో ప్రతీప్రాణీ ఏదో నిగూఢ రహస్యాలని ఛేదించాలనే సృష్టింపబడ్డా, ప్రపంచంలో లక్షలు, కోట్ల కొద్దీ ప్రాణులు చావలేక, ఎందుకో, ఎలాగో బతుకుతున్నాయి. నేనూ అంతే!

“నేనూ మీలాంటి భాష నేర్చిన మానవుణ్ణి గాబట్టి నాకూ ఆకలేసింది. ఆ ఆకలి గురించి నేను మొట్టమొదట్లో విమర్శించుకో లేకపోయాను. కొంతమందిని అడుక్కొన్నాను. పెట్టేవాళ్లు పెట్టేవారు. పొమ్మనేవాళ్ళు పొమ్మనేవారు. ఎప్పుడూ ప్రపంచమంతా ఒక్కసారిగా లేదనలేదుగా. అలానే అడుక్కొంటూ బతుకుతున్నాను.

“కాని ఒకరోజున ఎవరో నన్ను పిలిచి 'అలా అడుక్కొనే బదులు ఏదయినా పని చేసుకోగూడదా?' అన్నారు. అప్పుడే, మీరు నమ్మండి, నాలో గొప్ప శక్తి బయలుదేరింది. నేను అంతవరకూ, కేవలం అడుక్కొంటూ బతకడానికే పుట్టానని అనుకొంటూండేవాడిని. కాని ఆయనెవరో అలా అనగానే నేనూ పని చేసి చెమటోడ్చి సంపాయించగలిగే ఒక మహా శక్తినని, నామీద నాకే ఎందుకో ప్రేమ పుట్టింది.

“బయలుదేరాను. నెలరోజులు ఉద్యోగాల గురించి గాలించాను. నాకు చదువులేదు గాబట్టి ఎవరూ పనిచ్చారు కారు. గొడ్డులా కొండలు తవ్వి లోహాలని బయటికి తీస్తానన్నా ఎక్కడా నాకు పని దొరికింది కాదు. చివరికి ఒక గొప్ప ఉద్యోగం నా అదృష్టవశాత్తూ దొరికింది. ఆ ఉద్యోగానికి చదువు అవసరం లేదు. జ్ఞాన విజ్ఞాన విచక్షణాలసలే అక్కరలేదు. కావలిసింది కేవలం రాతిగుండె, ఎముకలని పిండి చేసి, రక్తాన్ని చిందించే బాహుబలం! ప్రయత్నించగలననే ధైర్యంమీద, ప్రపంచ శాంతి భద్రతలని కాపాడే 'రక్షకభటుడ' నయాను. అందులో ఆరు నెలలు నేనూ మానవుడనని మరచి పనిచేశాను. తర్వాత యిక అందులోనే అలాంటి క్రూరజీవితాన్ని గడపలేక, ఆ పని మాని బయటికి వచ్చేశాను. బయటికి రాగానే నన్ను నేనే నమ్మలేకపోయాను.

“మానవుడి కుండే సహజహృదయ మృదుత్వం నానించి మాయమయింది. ఇంతకముందు చీమ నీట్లోపడితే కలతచెందే నా మనస్సిప్పుడు, నాలాంటి మానవుల పీకలే నా కళ్ల ఎదురుగా లక్షలు లక్షలుగా నరకబడ్డా, ఏమాత్రమూ చలించదని తెలుసుకొని ఆశ్చర్యపోయాను.

“పోలీసు వుద్యోగం నేనందుకే మానేశాను. ఇంకా కొన్నాళ్లలా ఆ వుద్యోగంలోనే వుండివున్నట్టయితే, నేను పూర్తిగా శిలాహృదయుణ్ణయి పోయేవాణ్ణి. కాని త్వరలోనే మేల్కొన్నాను. పోలీసులు దేశంలో శాంతిదూతలు కారు. అశాంతి కిరాతకులు. వాళ్లచేతుల్లో గౌరవంగా బతికే మానవుడి దగ్గరనించి, అడుక్కొనే దరిద్రుడి వరకూ పోట్లు తినవలసిందే. ఎంతగొప్ప గౌరవస్థుడయినప్పటికీ, పోలీసులు ఆయన వ్యక్తిత్వాన్ని గుర్తించకండా, నేరంచేశాడనే నెపంమీద, నడివీధుల్లో బరబరా ఈడ్చివేయగల శక్తివంతులు. నాచేత్తోనే నేనలాంటి పనులెన్నో చేశాను.

"కాని చివరికి నేనా బందీనించి తప్పించుకొన్న తర్వాత నన్నెవరూ చేరదీయ లేదు. కారణం: నేను కొంతకాలం క్రితం రక్షకభటుడనై అమాయక ప్రజల్ని నా ఇష్టమొచ్చినట్టు శిక్షించాను గాబట్టి. మళ్ళా నా స్థితి మొదటికే వొచ్చింది. కాని ఈ ఉద్యోగంలో చేరకముందు నాలో కల్మషం వుండేదికాదు. నిర్మలహృదయంతో ధనవంతుల్నీ, దరిద్రుల్నీ గూడ యాచించాను. ఈ ఉద్యోగం చేసి మానేసిన తర్వాత నాలో ఒక విధమయిన అభిమానం, నాకంటె గొప్పవాళ్ళని చూసి అదోరకమయిన అసహ్యం, అసూయ, ఆగ్రహం కలిగాయి.

"కత్తి పట్టుకొని బయలుదేరాను, లక్షాధికారుల దగ్గరకి, కోటీశ్వరుల దగ్గరకి. జడిపించి బలవంతంగా పంచ భక్ష్య పరమాన్నాలని తిన్నాను. ఇప్పటికీ అలానే తింటున్నాను. అలానే మిమ్మల్ని గూడ జడిపించాను..." అంటూ నవ్వాడు.

శ్యామల వాడికేసి సూక్ష్మంగా చూసింది. ఆ కళ్ళల్లో ఏదో తేజస్సు ప్రతిఫలిస్తోంది. ఆ ముఖంలో ఏదో దివ్యజ్ఞానం వుంది. ఆ దీర్ఘ దేహంలో మానవాతీతమయిన మహాశక్తి వుంది. అతనికేసే అలా తేరపారి చూస్తోంది.

రామచంద్రరావుగారు కాసేపు వాడికేసీ, కాసేపు శ్యామలకేసి చూశారు. ఆయనకేమీ నమ్మకం లేదు వాడు చెప్పిన విషయాలు. అవన్నీ అబద్ధాలు. వైభవ యితర్లని వంచించడానికి ముందుగానే తయారు చేసుకొన్న ఉపన్యాసాలు.

"శ్యామలగారూ... దొంగనని మీ రనుమానించ నవసరంలేదు, దొంగనే. కాని మీరే చెప్పండి పుట్టిన మానవుడు ఎలా బతుకుతాడని?... ఏదో విధాన బతకాలి గదా? మనం మానవులం గాబట్టి క్రూరజంతువుల్లా పరస్పర సంఘర్షణలతో బతకలేం. సాధుజంతువుల్లా ఒకరిచేతికీ నోటికీ చూస్తూ జీవించలేం. స్వతంత్రంగా బతుకుతాం. కాని కాలం జరుగుతున్న కొద్దీ నవనాగరికతా నిర్వచనమంతా ఒకవ్యక్తి కలిగున్న డబ్బులోను, కరెన్సీనోట్లలోనూ వృద్ధవుతోంది. ఆ కాయితాలు కలిగున్నవాడు విలాసంగా డైనింగ్ టేబిల్సుమీద ఫోర్కు, స్పూన్లతో ఆ పొట్టకోసమే తింటాడు. లేని వాడూ అందుకోసమే గంజినీళ్లు జుర్రుకొంటాడు. కారణం, యిద్దరూ మానవులే గాబట్టి, ఇద్దరిలోనూ రక్తమే వుంది గాబట్టి.

"ఇప్పుడు డబ్బున్నవాడు లేనివాణ్ణి అణగదొక్కొచ్చు. అణగదొక్కబడినవాడు తిరగబడ్డా, పోలీసుల కప్పజెప్పి వాడి పక్కటెముకలు పిప్పిచేయించవచ్చు. కాని ఆ ధనవంతుడే గుండెమీద చెయ్యివేసుకొని ఎప్పుడయినా "ఈ డబ్బంతా నాకెలా వచ్చింది? ఈవాళ ఒక నాణెం తీసి వాడితే అది మరొకరి వశమయిపోతుంది గదా, మరి యిదంతా నాకే శాశ్వతమని ఎక్కడుంది?" అని సునిశితంగా విమర్శించుకొంటాడా?... విమర్శించుకోడు. విమర్శించుకొన్నా విలాసాలకి, భోగాలకి అలవాటుపడ్డ అతని హృదయం అందుకు సమ్మతింపదు, సమ్మతింపలేదు.

"అలాంటి భాగ్యవంతులని భయపెట్టి నాలాంటివాళ్ళు అన్నాన్ని తినొచ్చు. తింటారు గూడ. వాళ్ళకి అహక్కుంది. కారణం: ఆడబ్బు ధనవంతు డొక్కడిదే కాదు గాబట్టి. అయినా ప్రపంచంలో ఎంతమంది ధనవంతులున్నా రేవిటి? ప్రపంచ దరిద్రప్రజల్లో వెయ్యోవంతు మంది పూర్తిగా తలచుకొన్నా ఈ లక్షాధికారుల్నీ, కోటీశ్వరుల్నీ కాళ్ళకింద నల్లుల్ని నలిపేసినట్టు నలిపేయగలరు. కాని బీదవాడు తన దురదృష్టానికి తన పూర్వజన్మ పాపఫలితమనే తల బాదుకొంటాడు గాని, ఈ అసలు రహస్యాన్ని తెలుసుకోలేక పోతున్నాడు. అతను విమర్శించుకొనేందుకు తగినంత జ్ఞానాన్ని ధనవంతులే యివ్వకండా హింసిస్తున్నారు..." అంటూ అతను చేతులు కడుక్కొన్నాడు. తృప్తిగా తేన్చాడు.

తనింటికొచ్చి తనమీద యిన్నిమాట లంటున్నందుకు రామచంద్రరావుగారు దహించుకపోతున్నారు. వాడికేసి కళ్ళనించే అగ్నిజ్వాలల్ని కురిపిస్తున్నంత కోపంగా చూస్తున్నారు.

"శ్యామలాదేవిగారూ, నా కథ పూర్తిగా చెప్పాను నన్ను మీరు అర్థం చేసుకోవడానికి తాపత్రయపడుతున్నారు గాని, మీ నాన్న

మాత్రం నామీద పళ్లు కొరుకుతున్నారు... ఒకరొకరు అర్థం చేసుకోవాలంటే సజాతులు పనికిరారు. విజాతులు కావాలి. స్త్రీని పురుషుడు, పురుషుణ్ణి స్త్రీ అర్థం చేసుకోగలరు. నమస్తే... ఈవాళ నాకు తిండి పెట్టినందుకు మీకు నా హృదయపూర్వక వందనాలు...'' అంటూ కిటికీలోంచి ఛంగున దూకాడు.

రామచంద్రారావుగారు వాడు దూకడమే తడవుగా గబగబా పరుగెత్తి అలమారాలోంచి పిస్తోలు తీశారు. శ్యామల తండ్రిని ఆపినా, ఆ కోపంలో ఆయన కూతుర్ని పక్కకితోసి, కిటికీలోంచి పరుగెత్తుకపోతున్న వాణ్ణి కాల్చారు. శ్యామల గభుక్కున తండ్రిచేతిని గట్టిగా పట్టుకొని పిస్తోలు లాక్కొంది.

* * *

మర్నాడు సాయంకాలం కింది అంతస్తులో రామచంద్రరావుగారు వున్నారు. తిరిగి మళ్లా వాడు ఈవేళ వస్తాడనే అభిప్రాయం ఆయనకి లేదు. నిన్నటిదెబ్బ వాడికి బలంగా తగిలి వుంటుంది. ఏమో ఎందుకయినా మంచిదని పిస్తోలు పట్టుకొని వున్నారు.

తొమ్మిదయిన తర్వాత మామూలుగా శ్యామలవచ్చి తలుపుతట్టింది. ఆయన వెళ్లి తలుపు తీశారు.

''చేతిలో పిస్తోలు పారెయ్'' అనే కేక శ్యామల వెనకనించి వినబడింది. ఆయన శ్యామల వెనకవున్న వ్యక్తి కేసి చూశారు. నిన్నటివాడే!

ఛప్పున పిస్తోలు గురిపెట్టి, ''శ్యామల్ని వొదిలేయ్. లేకపోతే నిన్ను కాల్చేస్తాను''అరచారు.

''నువ్వు నన్ను చంపలేవు. నువ్వు పేల్చేగుళ్లు ముందు నీ కూతుర్ని బలిగొంటాయి ...ఊఁ. పారెయ్ పిస్తోల్ని.''

''నాన్నగారూ,పిస్తోలు పారేయండి, పారేయండి నాన్నగారూ''అంది వాడి చేతుల్లోవున్న శ్యామల.

రామచంద్రారావుగారు యిక చేసేది లేక చివరికి పిస్తోలు కింద పారేశారు. పిస్తోలు కింద పడ్డమే తరువాయి, వాడు శ్యామల్ని వొదిలి దాన్ని గబగబా వెళ్లి తీసుకొని, బులెట్సు అన్నీ తీసేశాడు. వట్టి కాళీ పిస్తోలుని ఆయనకిచ్చాడు.

''ఇప్పుడు నన్నీ పిస్తోలుతో పేల్చు...ఊఁ. పేల్చవేం? గుళ్లు లేవనా?...పాపం అది యింత వరకూ నన్ను జడిపించింది, కాని ఆగుళ్లు కాస్తా పోగానే చచ్చినట్టు పడుంది...మీ ధనవంతుల జీవితం అంతే తెలుసా?...ఆ డబ్బు వున్నంత వరకే మీ డాబులు, జడిపింపులు. ఆ తర్వాత గుండ్లులేని పిస్తోలు గతే'' అంటూ వాడు ఆయన చెయ్యిపట్టుకొని డైనింగ్ రూంలోకి తీసుకవెళ్ళాడు. శ్యామలగూడ వాళ్ళ ననుసరించింది.

టేబిల్ మీద రెండు ప్లేట్లలో భోజనం వుంది. వాడు కత్తిని ఎడంచేతిలో వుంచుకొని కుర్చీమీద కూచొని ప్లేటులో అన్నం కలుపుకొన్నాడు.

''నిన్న నువ్వు నామీదికి పిస్తోలు కాల్చావు కదూ? అవును నేను వెనక్కి తిరిగి నప్పుడే కాల్చగలవని నాకు తెలుసు. అది యిదుగో నాచేతికి తగిలింది'' అని ఎడంచేతిని చూపించాడు. ''కాని కూడుపెట్టి ఖూనీచేస్తే అది ఎంతపాపమో తెలుసా? పాప పుణ్యాలమీద నీకు నమ్మకం లేకపోయినా, సావకాశంగా కూచొని నీ అంతరాత్మని ప్రశ్నించుకో? అది ఏమని చెబుతుందో.''

శ్యామల కళ్లు అప్రయత్నంగా చెమ్మగిల్లినై. తండ్రికేసి చూసింది. ఆయన లోలోనే దహించుకపోతున్నట్టు కనిపెట్టింది.

''నీ శ్యామలని నువ్వు పిలచి పక్కన కూచోబెట్టుకొని అన్నం 'తినిపించడం లేదూ? అలానే నేనూ తింటే నీకెందు కంత కోపమొచ్చింది? నీ శ్యామలనయితే నువ్విలా కాల్చేవాడివా?...కాల్చవు...కారణం: ఆమె నీ రక్తకణం కాబట్టి.

''నిన్న నాకు అన్నం పెట్టినపుడు, నువ్వు మాటాడకండా వుంటే, నిన్ను నేను 'నువ్వు' అని ఏకవచనంలో సంబోధించినందుకు చాల బాధపడి, ఇకమీదట ఎప్పుడయినా కలిస్తే నిన్ను 'మీరు' అని గౌరవంగా పలకరించాలనుకొన్నాను. కాని నీ నైజం నిన్నలా పిలిపించుకొనేందుకు తగదుగా'' అన్నాడు.

పూర్తిగా అన్నంతిని చేతులు కడుక్కొని నిలబడ్డాడు.

"శ్యామలాదేవిగారూ నమస్తే. అసలు ఈ వాళ ఈపాటా మరో ధనవంతుడి యింట్లో అవవలసిందిగాని, నన్ను నిన్న రాత్రి మీ నాన్న కాల్చిన కాల్పు నాకు తగిలింది సుమా అని చూపించడానికి వచ్చాను. సరే, ఇక సెలవు. రేపు మరో లక్షాధికారి నాకు తిండి పెడతాడు..." అంటూ వాడు వెళ్ళిపోయాడు— ఈసారి ద్వారంనించే!

శ్యామల హృదయం కలత చెందింది. అతను మామూలు మానవుడులా లేడు. ఆయన తన్ని చాలా గౌరవించాడు. కాని నాన్నగారిని ఎక్కువగా దూషించాడు. ఆయనకి డబ్బుకంటే మనుషులే ముఖ్యమేమో! అతన్ని నిన్న నాన్నగారు కాల్చినా, తిరిగి ఆయన నాన్నగారిని నాలుగుమాటలని వెళ్ళిపోవడంతో ఆయనలో ఎంత క్షమాశక్తి వున్నదీ ఆమె వూహించ లేకపోయింది.

మర్నాడు సూర్యుడు పడమటి సముద్రాన కుంగిపోయిన తర్వాత శ్యామల చివరి అంతస్తులో పరుపుమీద పడుకొని ఆయనగురించే ఆలోచిస్తూ వుంది. ఆయన తన జీవితాన్ని చెబుతున్నప్పుడు, ఆయనమీద కాసేపు నమ్మకం కలిగేది, కాసేపు కలిగేది కాదు. ధనవంతులని నాశనం చేయాలని ఆయనకి కక్ష లేదుగాని, ధనవంతుల్లోని మానవత్వాన్ని పూర్తిగా మార్చేస్తున్న ఆ నాణాలని నిర్మూలం చేయాలన్నట్టు మాటాడారు. ఆయన్ని ఈ పరిస్థితులు మార్చేశాయి.

ఈవాళ యికరానని చెప్పారు. నిజంగా రారు. ఆయన దృఢకంఠంనించి వెలువడే మాటల్లో తనకి అసత్యాలే స్ఫురించలేదు. ఆయన మాటాడుతుంటేనే మంత్రముగ్ధ అయిపోతోంది. ఏవిఁటేవిఁటో అలానే ఆలోచించుకొంటూ రాత్రి చీకటి పడిపోయేవరకూ ఉండిపోయింది.

. "శ్యామలాదేవిగారూ"

"ఎవరు?" అంటూ శ్యామల తేరుకొంది. "మీరా?" అంది ఆశ్చర్యంగా.

"అవును నేను ఈవేళ యిక్కడికి రాగూడదనుకొన్నాను. కాని దొంగల్ని నమ్మొచ్చా?"

"అలా అనకండి. మీరు దొంగలు కారు" అనేసింది శ్యామల అప్రయత్నంగా. ఆ మాటలంటూ అతని ముఖంలోకి చూసి "మీరు భోంచేశారా?" అని ప్రశ్నించింది.

"ఆఁ నిన్న రాత్రి మీ యింట్లో" అన్నాడు.

శ్యామల అతన్ని డైనింగ్ రూంలోకి తీసుకెళ్ళింది.

అక్కడ రామచంద్రరావుగారు వున్నారు. వాళ్ళిద్దర్నీ చూసి ఆయన ఆశ్చర్యపడలేదు, వింతగా చూడలేదు. అలానే కూచొని వున్నారు.

శ్యామల అతనికి ఒక ప్లేట్లో భోజనం పెట్టి ఆహ్వానించింది.

"మీరు?" అని వాడు ప్రశ్నించాడు.

"మీరు ముందుగా తీసుకోండి. ఆకలి కడుపులు ముందుగా చల్లారాలి."

"శహభాష్!" అంటూ అరచాడు. "నిజంగా మీలాంటివారు ఒక్కొక్క ధనవంతుని ఇంట్లో ఒక్కొక్కరుంటే చాలు."

శ్యామల నవ్వుతూ మరో కుర్చీలో కూచొంది.

"కాని మానవుడు ఆ ఒక్క డబ్బువల్లే నీచాతినీచుడై పోతున్నాడు." అన్నాడు మెల్లగా, దిగజారిపోతున్న స్వరంతో.

శ్యామల తండ్రికేసి చూసింది. రామచంద్రరావుగారికా మాటలు శూలాల్లా తగిలాయి. కళ్ళెర్రచేస్తూ కుర్చీలోంచి గబుక్కున లేచి పెద్ద కేక వేశారు.

మరుక్షణంలో పొంచివున్న పదిమంది పోలీసులు అన్నం తినడానికి కూచొన్న అతన్ని బంధించివేశారు. రామచంద్రరావుగారు వికటంగా నవ్వి అతని దగ్గరకి వచ్చారు.

"ఇప్పుడు నువ్వక్కడ బాగా తినొచ్చు. పొట్టలకి, పక్కలకి కూడా ఇస్తూంటారు." అంటూ అతన్ని ఒక గుద్దు గట్టిగా గుద్దారు.

శ్యామల అడ్డుకొంది. "ఏవిఁటి నాన్నగారు యిదంతా?" అంది ఆశ్చర్యంగా.

"చూస్తున్నావుగా" అంటూ నవ్వి "వాణ్ణి జైలుకి తీసుకపదండి, నే నొస్తున్నాను" అని పోలీసులతో అన్నారు.

పోలీసులు అతన్ని లాగారు. వాడు

కదల్లేదు. వాళ్ల బండ చేతులనించి తప్పించుకోవాలని గింజుకొన్నాడు. పోలీసులు లాఠీలు ఉపయోగించి లాక్కుపోయారు. శ్యామల అడ్డుకొన్నా లాభంలేక పోయింది.

శ్యామల కళ్ళనించి నీళ్లు తిరిగిపోయాయి.

"నాన్నగారూ, అతనేం చేశాడని అతన్నలా పట్టి కొట్టిస్తున్నారు? కాస్త అన్నం అడుక్కుంటేనే అలా పట్టి బాధించేయాలా? ఆ ఆకలి అతనికీ మనకీ ఒకేమోస్తరుగా వున్నప్పుడు, దాని బాధనించి తప్పించుకొనేందుకు అలా మన్ని యాచిస్తే తప్పా? అధికారం వుపయోగించాడని మీరు కోపించి కిరాతకుల్ని పిలచారు. వాళ్లు అతన్ని చంపేస్తారు. అతన్ని అలా బాధించినంతలో మీకసి తీరిపోతుందా? అతనలా మారిపోవడానికి కారణం మీరు, మీ ధనం, మీలాంటి పిసినిగొట్టల కఠిన హృదయాలు. ఆ కఠిన హృదయాలతోనే అతను తిరగబడితే లాఠీలతో కుళ్లపొడిపించేస్తున్నారు. ఇదేనా మీన్యాయం? ఇదేనా మీ మానవత్వం? అతనన్నట్టు, ఆ దెబ్బలు తినేది నేనే అయితే మీ మనసెలా సహించి వూరుకోగలుగుతుంది? ఏం అతను గూడ మీకొడుకే అని ఎందుకనుకోగూడదు? అతను మీ వల్ల జన్మించలేదని, కర్కశహృదయులై అతన్ని చిత్రవధ చేయిం చేస్తారా? అయితే తోటి మానవుడిలో మానవత్వాన్ని గుర్తించలేని మనిషిగా ఎందుకు పుట్టారు?

"మీరు డబ్బు కూడ బెడుతున్నారు, ఎవరి కోసం? ఎవరికోసమో తెలీకుండా ఆ డబ్బుని దాస్తున్నారా? మీకు నేనుతప్ప మరో 'నా' అన్నవారు లేనప్పుడు, ఆ లక్షలకొద్దీ మన యినప్పెట్టెల్లో మూలుగుతున్న సొమ్ముని చచ్చిపోతున్న దరిద్రులచ్చేస్తే ఏమయిపోతుంది? ఆ ధనాన్ని నా కోసమే దాచారా? అయితే నాకవసరంలేదు. మీరే సుఖించండి..." అంటూ చేతుల్లో ముఖాన్ని దాచుకొని వెనక్కి తిరిగిపోయింది.

చేతిలో తీస్తున్న కండువా అలానే జారిపోయింది. రామచంద్రరావుగారి ముఖంలో ఒక విధమయిన ఆత్మపరీక్షాజ్ఞానం పొడసూపి, శ్యామలవేపు ఐనా చూడకుండా గబగబా పోలీసు స్టేషన్‌కేసి పరుగుతీశారు.

"ప్రజాపార్టీ కర్తవ్యం"

# నాయకులకు కొన్ని సూచనలు

కనకమేడల వెంకట్రామయ్య

ఆంధ్ర రాష్ట్రంలో "ప్రజాపార్టీ" పేరుతో ఆచార్య రంగా, ఆంధ్ర కేసరి ప్రకాశం గార్లు ప్రత్యేకంగా ఒక రాజకీయ పార్టీని నెలకొల్పటం ముదావహం. ఈ పార్టీలో శ్రీ ప్రకాశంగారి డెమోక్రాటిక్ పార్టీ, ఆచార్య రంగాగారి కిసాన్ మజ్‌దూర్ ప్రజా పార్టీ విలీనం చెయ్యబడ్డాయి. ప్రజాపార్టీ ఆశయం ప్రజాస్వామిక రైతు కూలీ ప్రజారాజ్య స్థాపన.

కాంగ్రెసు అధ్యక్ష ఎన్నిక ముగిసిన పిదప ఆచార్య కృపలానీ కాంగ్రెసులో నానాటికి ప్రబలుతూన్న అవినీతిని క్షాళనం చెయ్యటానికని కాంగ్రెసులోనే వుంటూ "కాంగ్రెస్ డెమోక్రాటిక్ ఫ్రంట్"ను స్థాపించారు. ఆచార్య కృపలానీ అభ్యర్థనపై కాంగ్రెస్ డెమోక్రాటిక్ ఫ్రంటు మద్రాసు శాఖను స్థాపించి, దానికి ఆర్గనైజర్‌గా పనిచేయటానికి శ్రీ ప్రకాశంగారు నడుంకట్టారు. అయితే మొన్న "ప్రజా పార్టీ" నిర్మాణంతో డెమోక్రాటిక్ ఫ్రంట్ మద్రాసుశాఖ రద్దయింది.

కిసాన్ మజ్‌దూర్ ప్రజా పార్టీ ఆచార్య రంగా చేత 'రైతు కూలీ ప్రజా రాజ్యం' అనే రాజకీయాశయంతో స్థాపింపబడింది. కాంగ్రెస్ ద్వారా రైతు కూలీ ప్రజారాజ్య ఆశయాన్ని ప్రచారం చేయటానికి ఆచార్య రంగా మహా